17వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

మంగళవారం అక్టోబర్ 20 2026 పేజీలు 8


## విజయదశమి ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలి

◆జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 19 :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఇంటా ఆనందోత్సాహాలను నింపాలని ఆకాంక్షించారు. దృఢమైన సంకల్పం, పట్టుదలతో ముందుకు సాగితే విజయం తప్పక సిద్ధిస్తుందనే స్ఫూర్తిని ఈ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు. దుర్గాదేవి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని, చేపట్టిన ప్రతి కార్యంలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సానుకూలత, విజయాలను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ కోరారు.

### ప్రజావాణి ఫిర్యాదులను

## సత్వరమే పరిష్కరించాలి



◆జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**చురకలు ప్రతినిధి జగిత్యాల, అక్టోబర్ 19 :** ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా

-2లో




## టీస్టాల్లలో అధికంగా మైనర్ల ధూమాపానం..

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 19 :** సరదాగా అలవాటైన ధూమాపానం వ్యసనంగా మారి జీవితాలను నాశనం చేస్తోంది. పొగ తాగే దురలవాటు మత్తు వైపు వెళ్లేలా ఆకర్షిస్తోంది. 18 ఏళ్లలోపు పిల్లలకు సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరం. జిల్లాలోని జగిత్యాల, మెట్ పల్లి, కోరుట్ల డివిజన్ కేంద్రాల్లో, వివిధ మండల కేంద్రాల్లోని పాన్ డబ్బాలు, టీ దుకాణాలు, కిరాణా షాపుల్లో సిగరెట్ల విక్రయాలు సాగుతున్నాయి. మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లాలో పోలీసులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ తరుచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే స్మోకింగ్ జోన్లను -మిగతా 2లో

## ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలి

◆ప్రతి కుటుంబంలో ఆనందాలు నిండాలి

◆జిల్లా ప్రజలకు ఆత్మీయ దసరా శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ చిత్రా మిశ్రా




**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 19 :** విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరిసి, ప్రతి కుటుంబంలో సంతోషాలు నిండాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకాంక్షించారు. దసరా పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.దసరా అంటే కేవలం పండుగ మాత్రమే కాదని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తూ మనలో ఆశలను, ధైర్యాన్ని, నూతనోత్సాహాన్ని నింపే పర్వదినమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో ఎదురయ్యే కష్టాలు తొలగి, సంతోషాలు చిగురించాలని, ప్రతి కుటుంబం ప్రేమాభిమానాలతో, ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఆకాంక్షించారు .పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించడంతో పాటు మనుషుల మధ్య ఆత్మీయతను, అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ దసరా పర్వదినం ప్రజలందరిలో ఐక్యత, సోదరభావం పెంపొందించాలని, ఒకరికొకరు అండగా నిలుస్తూ ఆప్యాయతలను పంచుకోవాలని కోరుకున్నారు.జిల్లా ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి దసరా పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు, ప్రతి మనసులో సంతోషం, ప్రతి కుటుంబంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకాంక్షించారు. ప్రజలందరికీ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

### శాంతిభద్రతల పరిరక్షణ,

## ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యం

◆సీపీ గౌష్ ఆలం, ఐపీఎస్



**చురకలు ప్రతినిధి కరీంనగర్, అక్టోబర్ 19 :** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ సోమవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులతో వారాంతపు నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

**కొత్త నేర చట్టాల అమలు :** కొత్త పోలీసు చట్టాల నిబంధనలను అవగాహన చేసుకొని, కేసుల నమోదు, దర్యాప్తును పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.దసరా బందోబస్తు:లి ప్రజలు ప్రశాంతంగా పండుగ జరుపుకునేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, రద్దీ ప్రాంతాల్లో నిఘా, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు.

**ఈ-పెట్టీ కేసులు :** చిన్నపాటి నేరాలు, న్యూసెన్స్, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు :** రక్తదాన శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ బాధితులకు సత్వర న్యాయం అందేలా విధులు నిర్వహించాలని సీపీ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**మొదటి పేజీ తరువాయి...**
తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు,



వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు.

ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి,సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తు దారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీవో లు మధు సూదన్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ





**చురకలు ప్రతినిధి కమాన్ పూర్, అక్టోబర్ 19 :** తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ వేడుకలు అని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం రాత్రి కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాల, కిష్టం పల్లె, గుండారం, రాజేంద్రనగర్ గ్రామాల్లో సభ్యుల బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ పండుగ సద్దుల బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి కమాన్ పూర్ మండల కేంద్రంలో జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు అందంగా పేర్చిన బతుకమ్మల మధ్య మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఆడబిడ్డల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి, బతుకమ్మలకు హారతి ఇచ్చారు. మహిళలు ఆటపాటల తో సంబరంగా వేడుకలను జరుపుకు న్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, సర్పంచులు రంగు సత్యనారాయణ గౌడ్, జంగిలి పోచాలు, ఉపసర్పంచులు రఫీ సోహెల్, అంబిరి రాజేందర్, ఇనగంటి రామారావు అంబిరి శ్రీనివాస్ సుతారి రాజేందర్ పూల నర్సాగౌడ్, కమ్మ గోన చౌదరి గౌడ్ పాల్గొన్నారు.

# పొగతాగొద్దు బాబు

**మొదటి పేజీ తరువాయి...**మాత్రం పోలీసులు పట్టించుకోవడం లేదు.

తనిఖీలు మృగ్యం....

బహిరంగంగా పొగ త్రాగే వారితో పాటు పిల్లలకు సిగరెట్లను విక్రయిస్తే సిగరెట్ అండ్ పోగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం 2003 ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉన్నా పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. టీస్టాళ్లలో ఒక్కసారి కూడా తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. మైనర్లు ధూమాపానం బారిన పడకుండా పోలీసులు, మున్సిపల్ యంత్రాంగం కోట్పా చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్లు, వివిధ ప్రజాసంఘాల వారు కోరుతున్నారు.

చాయ్ అడ్డాలే కేంద్రాలుగా...

పేరుకే చాయ్ అడ్డాలుగా ఉంటాయి. లోపలికి వెళ్తే అక్కడ గుప్పుమంటూ పొగ త్రాగేవారే అధికంగా కన్పిస్తారు. ఆధునిక హంగులు, లైటింగ్, కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేస్తారు. మైనర్లకు సిగరెట్లు అమ్ముతున్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో దుమ్ము లాగుతూ కన్పిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో అడ్డాలు..

వివేకానంద స్టేడియం బయట టేలాలు, జంబిగద్దె సమీపంలో, బైపాస్ రోడ్డులో, కలెక్టరేట్ కు వెళ్లే రోడ్డులో, చల్ గల్ కు వెళ్లే రోడ్డులో హరిశ్చంద్ర శ్మశానం గొల్లపల్లి రోడ్డులో, డిగ్రీ కాలేజి సమీపంలో, అంగడి బజార్లో, పట్టణంలోని వివిధ చాయ్ అడ్డాల్లో మైనర్లు అయిన విద్యార్థులు అధిక సంఖ్యలో దమ్ము లాగుతూ ఉంటారు. టీస్టాళ్లు ధూమాపాన ప్రియులకు అడ్డాలుగా మారాయి. అడ్డాల్లో యువకులతో పాటు బాలురు సిగరెట్లు తాగుతున్నట్లు సమాచారం. పోలీసులు తనిఖీలు చేస్తే ధూమాపానం ఆరికట్టవచ్చు.

చట్టం ఏం చెబుతోంది...?

హరి అశోక్ కుమార్, సీనియర్ న్యాయవాది, జగిత్యాల...

పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని నియంత్రించేందుకు కోట్పా చట్టం 2003ను కేంద్రం తీసుకొని రాగా, 2004 మే 1న అమలులోకి వచ్చింది. సెక్షన్ (4) బహిరంగ ప్రదేశాల్లో, హోటళ్లు, సినిమా టాకీసులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కార్యాలయాల్లో ధూమాపానం నేరం, సెక్షన్(6) ఈ చట్ట ప్రకారం 18 ఏళ్ల లోపు పిల్లలకు సిగరెట్లు, ఇతర పొగాకు పదార్థాలు విక్రయించవద్దు. విద్యాసంస్థల చుట్టు 100 మీటర్ల దూరంలో పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేదం. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా, జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం జైలుశిక్ష పడే అవకాశం ఉంది.

## ప్రజావాణికి ఆరు దరఖాస్తులు




**చురకలు విలేకరి, ఎండపల్లి, అక్టోబర్ 19 :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఆరు దరఖాస్తులు అందాయి. ఎంపీడీవో డి. కృపాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. అందిన దరఖాస్తుల్లో మండల ప్రజా పరిషత్‌కు సంబంధించి ఒకటి, తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించి ఒకటి, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి నాలుగు దరఖాస్తులు ఉన్నాయి. అర్జీలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో డి. కృపాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సీనియర్ సహాయకులు వంశీకృష్ణ,ఆర్ ఐ అన్వేష్, మండల వ్యవసాయ అధికారి కే. మహేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కాజోద్దీన్,మండల సీఆర్‌పీ రాజమణి, ఎస్.శ్రీనివాస్,ఎస్సీ సంక్షేమశాఖ తరఫున బి.కొమురయ్య పాల్గొన్నారు.

## ఈ నెల 22నుండి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

**చురకలు,విలేఖరి,వెల్గటూర్, అక్టోబర్ 19 :** ఈ నేల 22 నుండి సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు వెల్గటూర్ మార్కెట్ కమిటీ ఇంచార్జి కార్యదర్శిహరికృష్ణ తెలిపారు. ఎండపల్లి మండలం కొత్తపేట జిన్నింగ్, ప్రెస్సింగ్ కాటన్ మిల్ లో కొనుగోలుకేంద్రం ఏర్పాటు చేసినట్లు,పత్తి రకాన్ని బట్టి క్వింటాలుకు8,667,8,617,8,567,గాధరనిర్ణయించినట్లు పేర్కొన్నారు.పత్తిలో తేమ శాతం,నాణ్యతనుబట్టి ధరలో మార్పులు ఉంటాయన్నారు. రైతులు కాసాప్ కిసాన్ యాప్ ద్వారా స్లాబ్ బుక్ చేసుకొని కేటాయించిన తేదీన పత్తి తీసుకురావాలనిసూచించారు.పత్తిని ఆరబెట్టి నాణ్యత ప్రమాణం ఉండేలా, బోరాల లో కాకుండా విడిగా తీసుకు రావాలని కోరారు.

## హుజురాబాద్‌లో.. దసరా వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

**-మున్సిపల్ చైర్మన్ ఆర్ సుహాసిని, కమిషనర్ బి కిషన్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 19 :** హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ హైస్కూలు మైదానంలో దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ ఆర్ సుహాసిని, కమిషనర్ బి కిషన్ వెల్లడించారు. సోమవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ..దసరా సందర్భంగా.. హై స్కూల్ మైదానంలో శాస్త్రోక్తంగా సాంప్రదాయబద్ధంగా శమీ పూజ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అనంతరం రావణాసుర వధ కార్యక్రమం కూడా ఉంటుందని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**భారీ బందోబస్తు**

దసరా సందర్భంగా పట్టణంలో జరిగే శమీ పూజ కార్యక్రమం తో పాటు రావణాసుర వధ కార్యక్రమం వద్ద పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని స్థానిక సీఐ కరుణాకర్ తెలిపారు. అలాగే ఏసిపి వాసంశెట్టి మాధవి ఆదేశాలు సూచనల మేరకు పట్టణంలోనూ పలుచోట్ల బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఎక్కడ ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఉన్న తమకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శరన్నవరాత్రులలో ప్రధానమైనది మహా నవమి

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ నవమి వరకూ దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. నవరాత్రులలో చివరి రోజు.. అంటే ఆశ్వయుజ శుక్లపక్ష నవమిని "మహర్నవమి" అంటారు. "దుర్గాష్టమి", "విజయదశమి" లాగే "మహర్నవమి" కూడా అమ్మవారికి విశేషమైన రోజు. మహర్నవమి నాడు అమ్మవారిని "అపరాజిత"గా పూజిస్తారు. మహిషాసురమర్దినిగా అలంకరించి ఆరాధిస్తారు. శరన్నవరాత్రులలో అత్యంత ప్రధానమైనది మహా నవమి. చివరి మూడు రోజులైనా అమ్మవారిని పూజించాలని దేవీ భాగవతంలో పేర్కొన బడింది. జగజ్జనని ఆరాధన తొమ్మిది రోజులు చేయడం శ్రేష్ఠం కాగా, చేయలేని వారు సప్తమి నుండి మూడు రోజులు త్రిరాత్ర వ్రతమని పూజలు చేస్తారు. అది కూడా కుదరని పక్షంలో మహా నవమి రోజైనా తప్పక అమ్మవారిని పూజించాలి. దసరా పూజలకు ఇదే ప్రధానం. విజయ దశమి పూజ అనేది పున: పూజ, ఉద్వాసన మాత్రమే అని నిర్ణయ సింధువులో స్పష్టంగా తెలియ జేయబడినది.కాశ్మీర్, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్ మొదలైన ప్రదేశాల్లో మహర్నవమి రోజున "కన్యా పూజ" నిర్వహిస్తారు. నవరాత్రులను పురస్కరించుకుని తొమ్మిదిమంది కన్యా రూపాలు సంకేత పూర్వకంగా ప్రాతినిధ్యం వహిస్తుండగా ఆ శక్తి స్వరూపాలను ఆరాధిస్తారు. అమ్మవారికి అభిషేకం చేసి ముఖాన కుంకుమ దిద్ది, కొత్త బట్టలు సమర్పిస్తారు. ఇంకొన్ని ప్రాంతాల్లో మహర్నవమి నాడు సువాసిని పూజ, దంపతి పూజ జరుపు కుంటారు.ఇతర రాష్ట్రాల్లో దుర్గాష్టమి రోజున ఆయుధ పూజ చేయగా కేరళ రాష్ట్రంలో మాత్రం మహర్నవమి నాడు ఆయుధ పూజ చేసే సంప్రదాయం కొనసాగుతోంది. క్షత్రియులు, కార్మికులు, వాహనదారులు, కులవృత్తులవారు ఆయుధపూజను నిర్వహిస్తారు. నవరాత్రులు ముఖ్యంగా మహర్నవమి సందర్భంగా మైసూరు మహారాజా ప్యాలెస్ ను మహాద్భుతంగా అలంకరిస్తారు. అమ్మవారి దేవాలయాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ మహర్నవమి రోజున దేవీ ఆలయాలు భక్తులరద్దీతో కిక్కిరిసి ఉంటాయి. విజయవాడ, కలకత్తా, ఉజ్జయిని తదితర ప్రాంతాల్లో ఉన్న కనకదుర్గ ఆలయాలకు దేశం నలుమూలల నుండి లక్షలాదిమంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.సింహవాహనారూఢై, ఉగ్రరూపంతో, అష్టభుజాలతో పాశం, అంకుశం, త్రిశూలం మొదలైన ఆయుధాలను ధరించి దర్శనమిచ్చే మహాశక్తిని పూజిస్తే శత్రుభయం ఉండదని విశ్వాసం. అన్ని అవతారాలలోనూ ఆది పరాశక్తి దుష్ట



రాక్షసులను సంహరించింది ఆశ్వయుజ శుద్ధ నవమి నాడే. భగీరథుడు గంగను భువి నుంచి దివికి తెచ్చింది కూడా ఈనాడే. ఈ రోజు మరొక విశేషం ఆయుధ పూజ. దుర్గాష్టమి, విజయదశమి లాగే 'మహర్నవమి' కూడా అమ్మవారికి విశేషమైన రోజు మహిషాసుర మర్దినిగా అలంకరించి ఆరాధిస్తారు. అమ్మ దుర్గాదేవి అనేకావతారాల్లో అపరాజితాదేవి దుర్మార్గులను ఓడించి సన్మార్గులకు సుఖజీవనాన్ని అందించే అవతారం అపరాజిత – అంటే ఏవరి చేతా ఓడించబడని అని అర్థం. సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోస్తుతే... అంటూ అమ్మలగన్న అమ్మ మూల పుటమ్మ ను ఆరాధించిన వారికి, మహర్నమి నాడు అమ్మను స్తుతించినవారికి సకల వ్యాధుల బారినుండి కాపాడి సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తుంది, అపమృత్యువును పోగొడుతుంది, పరిపుష్టికరమైన ఆహారాన్నిస్తుంది, సకలసంపదల నిస్తుంది.

**శమీ, ఆయుధ పూజలకు ఏర్పాట్లు**

'శమీ శమయతే పాపం, శమీ శత్రు వినాశినీ, అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియదర్శినీ' ...భారత, రామాయణాది పౌరాణిక గాథలలో శమీ వృక్షానికి విశేష ప్రాధాన్యత కల్పించ బడింది. శమీకి అపరాజిత అనిపేరు. అంటే ఓటమి నెరుగని మాతయని అర్థం. అమెయే విజయ నామాంకితయైన జగజ్జనని. శరన్నవరాత్రి వేడుక లలో భాగంగా, దుర్గా మాతను తొమ్మిది రోజులుగా కొలిచి నట్లయితే సర్వ శక్తులు సమకూరి, విజయ దశమి నాడు విజయం చేకూరగలదని భక్తుల, ఆధ్యాత్మిక కార్యానురక్తుల ప్రగాఢ విశ్వాసం. అందులకై దసరా ఉత్సవాలలో ముగింపుగా విజయ దశమి పర్వ దినాన సాయంత్రం శమీ (జమ్మి) వృక్షాన్ని పూజించి, సర్వాభీష్ట సిద్ధికై ప్రార్థించడం ప్రాచీన కాలంనుండి అనుసరిస్తున్న సత్సాంప్రదాయం. మంగళ వారం విజయ దశమి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం లోని ప్రధానాలయాలైన శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీసమేత నారసింహ, శ్రీవేంకటేశ్వర, రామలింగేశ్వరాలయాలలో విశేష పూజలు, వేడుకలు నిర్వహించేందుకు సంసిద్ధ మవుతున్నారు. ప్రత్యేకించి, క్షేత్ర శివారులో, అక్క పెల్లి రాజేశ్వరాలయ దారిలోగల అక్కపెల్లి రాజేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ శీలం పెద్ద గంగారాం బహూకృత స్థలంలో నూతన నిర్మిత స్థలమందు శమీ, ఆయుధ పూజలు శని వారం సాయంత్రం నిర్వహిం చేందుకు ఏర్పాట్లను గావిస్తున్నారు.

**వైభవంగా మహర్నవమి వేడుకలు**

సుప్రసిద్ధ పుణ్యతీర్థమైన ధర్మపురి క్షేత్రంలో శర న్నవరాత్రి ఉత్సవాలలో అంతర్భాగంగా మహర్నవమి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. పర్వదిన సందర్భంగా దేవస్థానాంతర్గత శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీనారసింహ, శ్రీవేంకటేశ్వర, శ్రీరామలింగేశ్వర ఆలయాలలో ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, ఓంకార శర్మ, అర్చకులు నంబి శ్రీనివాసాచార్య, నరసింహ మూర్తి, వంశీ, హరినాథాచార్య, అశ్విన్ కుమార్, నేరేళ్ళ శ్రీనివాసాచార్య, రమణాచార్య, సంతోష్ కుమార్, విజయ్, కళ్యాణ్, కిరణ్, మోహన్, తదితరులు విధివిధాన వేదోక్త సాంప్రదాయ ప్రత్యేక అర్చనలు, నిత్య కల్యాణ కార్యక్రమాలను గావించారు. శ్రీరామలింగేశ్వర ఆలయంలో గల శ్రీశారదామాత మందిరంలో దేవస్థాన వేదపండితులు పాలెపు ప్రవీణ్ శర్మ, సందీప్ శర్మ, అరుణ్, సాయి, అర్చకులు దేవళ్ళ విశ్వనాథశర్మ తదితరులు, ప్రత్యేక దుర్గామాత పూజలొ నరించారు. నవగ్రహ, వాస్తు, క్షేత్రపాలక, స్థాపిత దేవతా హోమాలు, చండీ సప్త శతి హవనం, చతుష్షష్టి పూజలు, బలిప్రదానం, పూర్ణాహుతి తదితర సాంప్రదాయ పూజల నొనరించారు. ఈఓ శ్రీనివాస్ దర్శకత్వంలో సూపరింటెండెంట్ కిరణ్, శ్రీనివాస్, దేవస్థానం సిబ్బంది, భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని పర్యవేక్షించి, అవసరమగు వసతులు కల్పించారు. శ్రీనర్స దేశ్వర మందిరంలో వేదవిదులైన పండితులు, పాలెపు చంద్రమౌళి శర్మ, వెంకట రమణ శర్మ ఆధ్వర్యంలో స్థాపిత దుర్గామాతకు విశేష పూజలొనరించారు. పూర్ణాహుతిని నిర్వహించారు. నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో కొత్త టి టి డి కల్యాణ మండపంలో అశేష భక్తజనం కార్యక్రమాలలో భాగస్వాములైనారు. లక్ష్మీనరసింహుని పొన్నచెట్టు సేవలకు పురవీధులగుండా ఊరేగించారు.

**సిద్ధి రాత్రి రూపంలో అమ్మవారు**

ధర్మపురి క్షేత్రస్థ శ్రీరామలిం గేశ్వరాయలంలో ప్రతిష్ఠిత శారదామాత సోమ వారం సిద్ధి రాత్రి దేవి రూపంలో దర్శనమిచ్చింది. దుర్గా మాత నవమ శక్తి సిద్ధి రాత్రి నామంతో ప్రసిద్ధి. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకమ్య, ఈశిత్వ, వశిత్వ అని అష్ట సిద్ధుల పేర్లు. దేవీ పురాణానుసారం శివుడు సిద్ధిరాత్రి కృప వల్ల ఈ అష్ట సిద్ధులు పొందినట్లు, అర్ధ శరీరం దక్కి, శంకరుడు అర్ధనారీశ్వరుడు అయినట్లు కథనం. దక్షిణ పైచేయిలో గద, కింది చేతిలోచక్రం, వామ పై చేతిలో కమలం, ఎడమ కింది చేతిలో శంఖం కలిగి, సింహ వాహనంపై ఉండే దేవి శుభముల ఫల దాయినిగా, నవమ దినం నాడు సిద్ధి రాత్రి దేవిగా ఆరాధించడం సంప్ర దాయం. నవదుర్గలలో సిద్ధి రాత్రి దేవి మహా శక్తి సంపన్నురాలై పారలౌకిక కామలన్నింటినీ సిద్ధింప చేయగలదని, ఆదేవిని ఉపాసించడం వల్ల సకల పాపాలు మటుమాయమై పోతాయనే భక్తుల విశ్వాసం. ఈనేపథ్యంలో సిద్ధి రాత్రి మాతృ ధ్యాన, స్మరణ, పూజ, ఆరాధన వల్ల సకల శుభాలు కలుగు తాయనే విశ్వాసంతో అమ్మవారిని అందుకు అనుగుణంగా అలంకరించి, పూజలు నిర్వహించగా వేలాది మంది భక్తులు తన్మయత్వంతో ప్రార్థించారు. దేవస్థానం ఇఓ శ్రీనివాస్, సిబ్బంది ఏర్పాట్లు గావించారు. శరన్నవరాత్రి వేడుకలలో అంతర్భాగంగా స్థానిక నర్సదేశ్వర మందిరంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజా దులను నిర్వహించారు. నవ దుర్గ సేవా సమితి, మహా శక్తి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## ప్రజావాణికి దరఖాస్తులు



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (19) :** ప్రజా సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు.ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం మూడు వినతులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు ఒకటి, హౌసింగ్ శాఖకు ఒకటి, డీఆర్‌డీఏ శాఖకు ఒకటి చొప్పున వినతులు అందాయి. స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు అధికారులు తెలిపారు.వినతుల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సీహెచ్ గణేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేసిన సర్పంచ్



**చురకలు ప్రతినిధి కోరుట్ల అక్టోబర్ 19 :** దసరా పండుగను పురస్కరించుకుని ధర్మారం గ్రామ సర్పంచ్ రంజిత్ రెడ్డి సోమవారం తన నివాసం వద్ద గ్రామ పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణలో గ్రామ పంచాయతీ సిబ్బంది అందిస్తున్న సేవలను సర్పంచ్ అభినందించారు. పండుగ వేళ సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేసి వారితో ఆత్మీయతను పంచుకున్నారు.

## హెచ్ఎన్‌డీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు



**చురకలు ప్రతినిధి కోరుట్ల అక్టోబర్ 19 :** కోరుట్ల నియోజకవర్గంలోని మెట్‌పల్లి పట్టణం వెల్లుల్ల రోడ్డులో ఉన్న అభయ హస్త హనుమాన్ మందిరం వద్ద హనుమాన్ నగర్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్ఎన్‌డీఎస్) ఆధ్వర్యంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు 108 రకాల ప్రసాదాల సమర్పణ, గోపూజ, కుమారి పూజ, పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం, బెల్లంతో అభిషేకం, విశేష గాజుల అలంకరణ, దుర్గా హోమం, అమ్మవారికి బోనాలు, సహస్ర దీపాలంకరణ సేవలు నిర్వహిస్తున్నారు. అలాగే వేద పారాయణాలు, దుర్గాసూక్తాలు మహిళలచే లలితా సహస్రనామ పారాయణం, భక్తి పాటలు, భజనలు, సంగీత కచేరీలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు, బతుకమ్మ ఆటపాటలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.శివపార్వతుల కల్యాణం, సరస్వతీ పూజ నిర్వహించి విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో హనుమాన్ నగర్ కమిటీ సభ్యులు, భవానీ దీక్ష స్వాములు, కాలనీ మహిళలు, చిన్నారులు, పెద్దలు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# ప్రజలకు సేవచేసే అవకాశం రావటం గొప్ప వరం లాంటిది

**-బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య**



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 19 : ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం గొప్ప వరం లాంటిదని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య అన్నారు, ఎల్లారెడ్డిపటం మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ఏఎం సి వైస్ ప్రెసిడెంట్ గా నియమితులైన నంది కిషన్ ను డైరెక్టర్గా నియమితులైన మిట్టపల్లి లక్ష్మణ్ సిరిపురం మహేందర్లకు సోమవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి మండల మున్నూర్ కాపు సంఘం అధ్యక్షులు మేడిపల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిథిగా తోట ఆగయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ ఈ పార్టీ అయినా ఏ పార్టీ అయినా ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు, రైతు బంధువులకు సేవచేసే కార్యక్రమాలను ఎల్లకాలం గుర్తుండిపోయేలా పనిచేసి పేరు తెచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ నంది కిషన్ మాట్లాడుతూ ఒకే సామాజిక వర్గానికి చెందిన తమకు వైస్ ప్రెసిడెంట్ గా ఇద్దరికీ డైరెక్టర్ లుగా ఎప్పుడు లేని విధంగా అవకాశం ఇచ్చినందుకు ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కు నియోజకవర్గం ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి కి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.రైతంగానికి సేవ చేయడానికి అవకాశం ఇచ్చినందుకు అందరూ మెచ్చేలా పని చేస్తామని అందుకు అందరి సహకారం ఎల్లవేళలా ఉండాలని ఆయన కోరారు.ఈ సన్మాన కార్యక్రమంలో సెస్సు డైరెక్టర్ బి.ఆర్.ఎస్ మండల అధ్యక్షులు వరుస కృష్ణ హరి,కొమిరిశెట్టి తిరుపతి, మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు బండారి బాల్రెడ్డి మీసం రాజం,కిష్టయ్య అనిల్ మేగి నరసయ్య ఉప్పుల రాజ్యం,రవి,దేవవ్వ,ఆకుల దేవేందర్ జవ్వాజీ లింగం,భూపతి వద్నాల రాజు నారాయణ తదితరులు పాల్గొని వారిని సన్మానించారు.

# ఎల్లారెడ్డిపేటలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

**-తొమ్మిది రోజుల పాటు పూల పండుగతో కళకళలాడిన పల్లెలు**
**-ఆటపాటలతో సందడి చేసిన మహిళలు**
**-చెరువులు, కుంటల్లో బతుకమ్మల నిమజ్జనం.. గౌరమ్మకు ప్రత్యేక పూజలు**





చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 19 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ఎల్లారెడ్డిపేట మండలంలోని అన్ని గ్రామాల్లో అంగరంగ వైభవంగా ముగిసింది. ప్రకృతిని పూలరూపంలో ఆరాధిస్తూ, మహిళల ఐకమత్యానికి, కుటుంబ అనుబంధాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం పల్లెల్లో పండుగ వాతావరణాన్ని నింపాయి. తొమ్మిది రోజులపాటు సాగిన బతుకమ్మ సంబరాలు చివరి రోజైన సద్దుల బతుకమ్మతో ముగియడంతో గ్రామాల్లో ఎటుచూసినా పూల సందడి, మహిళల కోలాహలం కనిపించింది.ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ పూల పండుగ తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు,సంప్రదాయ పాటలు, ఆట పాటలతో కొనసాగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ గ్రామాల్లో మహిళలు ప్రతిరోజూ తీరొక్క పూలతో బతుకమ్మల ను అందంగా పేర్చిపూజలు నిర్వహించారు.చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా పూలతో ప్రత్యేకంగా బతుకమ్మలను అలంకరించి, భక్తిశ్రద్ధలతో గౌరమ్మను ఆరాధించారు.

**రంగురంగుల పూలతో బతుకమ్మల అలంకరణ**

సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు తంగేడు, గునుగు తదితర స్థానికంగా లభించే పూలతో పాటు వివిధ రకాల రంగురంగుల పూలను సేకరించి బతుకమ్మలను అందంగా పేర్చారు.ఒక్కో వరుసలో ఒక్కో రకమైన పూలను అమర్చుతూ ఆకర్షణీయంగా బతుకమ్మలను రూపొందించారు. పూల సోయగాలతో అలరించిన బతుకమ్మల ను ఇళ్ల నుంచి తీసుకొచ్చి గ్రామాల్లోని కూడళ్ల వద్ద ఒకచోట చేర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు,యువతులు, చిన్నారులు బతుకమ్మల చుట్టూ చేరి వలయాకారం గా తిరుగుతూ పాటలు పాడారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో"అంటూ పాడిన పాటలు పల్లెల్లో మార్మోగాయి. చప్పట్లతో లయబద్ధంగా అడుగులు వేస్తూ నిర్వహించిన బతుకమ్మ ఆటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఒకరి పాటకు మరొకరు గొంతు కలుపుతూ, సంప్రదాయ బతుకమ్మ పాటలను ఆలపిస్తూ మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

**చెరువులు,కాలువలు,వాగులు,కుంటల్లో బతుకమ్మల నిమజ్జనం**

గ్రామాల్లోని కూడళ్ల వద్ద బతుకమ్మ ఆటపాటలు నిర్వహించిన అనంతరం మహిళలు బతుకమ్మలను ఊరేగింపుగా చెరువులు, కుంటల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేశారు.దీంతో తొమ్మిది రోజులపాటు పూలతో అలరించిన బతుకమ్మ సంబరాలకు ముగింపు పలికారు.నిమజ్జనం అనంతరం మహిళలు తమ వెంట తీసుకొచ్చిన సద్దులను ఒకరికొకరు పంచుకున్నారు. వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటూ పరస్పర ఆప్యాయతను చాటుకున్నారు. కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు, ఇరుగుపొరుగు మహిళలు కలిసి సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడంతో పల్లెల్లో సామాజిక ఐకమత్యం వెల్లివిరిసింది. పండుగ సందర్భంగా కలుసుకున్న మహిళలు ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు.

**గౌరమ్మకు పూజలు.. కుటుంబాల క్షేమం కోసం ప్రార్థనలు**

సద్దుల బతుకమ్మతో పాటు చిన్న బతుకమ్మను కూడా పేర్చి అందులో గౌరమ్మను ప్రతిష్ఠించి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపుతో గౌరమ్మను రూపొందించి భక్తిశ్రద్ధలతో పూజించడం బతుకమ్మ పండుగలో ప్రత్యేకతగా నిలుస్తుంది.అమ్మవారి కృపతో తమ కుటుంబాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు కలగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని మహిళలు ప్రార్థించారు.బతుకమ్మ పండుగ కేవలం పూలను పేర్చి ఆడుకునే వేడుక మాత్రమే కాకుండా, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి, మహిళల ఐకమత్యానికి, కుటుంబ బంధాలకు ప్రతీకగా నిలుస్తోంది. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని నేటితరం మహిళలు, యువతలు కూడా కొనసాగించడం విశేషం. పూలతో అమ్మవారిని ఆరాధిస్తూ, సంప్రదాయ పాటలతో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ మహిళలు పండుగను భక్తిభావంతో జరుపుకున్నారు.

**బతుకమ్మ ఘాట్ల వద్ద పంచాయతీల ఏర్పాట్లు**

సద్దుల బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా మహిళలకు ఇబ్బందులు కలగకుండా గ్రామ పంచాయతీల పాలకవర్గాలు ఆయా గ్రామాల్లోని బతుకమ్మ ఘాట్ల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేపట్టాయి.నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి,నీటి సౌకర్యాలు కల్పించడంతో పాటు మహిళలు సౌకర్యవంతంగా ఆటపాటల్లో పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు. పండుగను ప్రశాంతంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించు కునేందుకు స్థానికంగా ఏర్పాట్లు చేశారు.

**పల్లెల్లో పండుగ శోభ**

తొమ్మిది రోజులపాటు పూల పరిమళాలతో అలరించిన బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మతో ముగియడంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, సంప్రదాయ పాటలు, మహిళల ఆటపాటలు, వాయనాల పంపిణీతో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు మరోసారి పల్లెజీవనంలో సంప్రదాయాల ప్రాధాన్యతను చాటిచెప్పాయి.పూలను పూజిస్తూ ప్రకృతిని గౌరవించడం, కుటుంబాల క్షేమం కోసం అమ్మవారిని ప్రార్థించడం, పరస్పర ప్రేమాభిమానాలను పంచుకోవడం వంటి విశిష్టతలతో సద్దుల బతుకమ్మ వేడుకలు ఎల్లారెడ్డిపేట మండలంలో ఘనంగా ముగిశాయి.

## క్రికెట్ టోర్నమెంట్లో యంగ్స్టార్ టీం ఘనవిజయం



చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 19 : ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ సోమవారం ఉత్కంఠభరితంగా జరిగింది. ఫైనల్ మ్యాచ్లో కింగ్స్ లెవన్ టీంపై యంగ్స్టార్ టీం 6 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా యంగ్స్టార్ టీం సభ్యులకు గ్రామ పెద్దలు,యువకులు అభినందనలు తెలియజేశారు. గ్రామ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ,యువతను ప్రోత్సహిస్తున్న దుర్గాభవాని ఉత్సవ కమిటీ సభ్యులకు గ్రామస్థుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు.భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తూ యువతలో ప్రతిభను వెలికితీయాలని ఆకాంక్షిస్తున్నాం.విజేత:యంగ్స్టార్ టీం,రన్నరప్:కింగ్స్ లెవన్ టీం,యువతే గ్రామ అభివృద్ధికి బలం...క్రీడలే యువతకు ప్రేరణ!అని పలువురు కొనియాడారు.

## బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 19 : ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన గున్నాల ఎల్లయ్య(60) అనే గీతా కార్మికుడు ప్రమాదవశత్తు ఈత చెట్టుపై నుండి శుక్రవారంరోజున జారిపడి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండగా సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని మధిర గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్గౌడ్ తెలిపారు.ఆ నిరుపేద కుటుంబానికి పెద్ద దిక్కు అయినా ఎల్లయ్య మృతితో అతని భార్య ఇద్దరు పిల్లలు అనాధలుగా మిగిలినారని ఆ కుటుంబం వీధిన పడిందని ఆ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి అన్ని విధాలు గా ఆదుకోవాలని రాష్ట్ర రవాణాశాఖ బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్కు ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ నియోజకవర్గం ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్కు శ్రీనివాస్ గౌడ్కు జిల్లా గ్రంథాలయాల చైర్మన్ సత్యనారాయణ గౌడ్కు గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ వెంకటస్వామిగౌడ్ మల్లేశం గౌడ్ మహేందర్ గౌడ్ ఎల్లా గౌడ్లు విజ్ఞప్తి చేశారు.

## బతుకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రణవ్



చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 19 : వీణవంక మండలం గంగారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి బతుకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్.ఈ సందర్భంగా బతుకమ్మ పండగ రోజున విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని,ఆడబిడ్డలందరికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుల్లూరి కుమార్, గుండెపు కోమల్ రెడ్డి, నల్ల రవీందర్ రెడ్డి, పుల్లూరి సంపత్, రామ్ రెడ్డి, రాజిరెడ్డి ,నాగేందర్ రెడ్డి ,రవీందర్ రెడ్డి ,శ్రీను, రామకృష్ణారెడ్డి, నవీన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ,రవీందర్ రెడ్డి ,రాజు యాదవ్, కోమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ ఆయుధపూజ

**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 19 :** విజయదశమి, దసరా నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించు కుని నిర్మల్ జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ. జానకి షర్మిల పాల్గొని పోలీస్ ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీస్ వాహనాలకు వాహనపూజ చేశారు. తదనంతరం ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో జమ్మి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,



దసరా నవరాత్రుల్లో భాగంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఆయుధపూజ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. పోలీస్ శాఖలో ఆయుధాలు, వాహనాలు విధి నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. నిర్మల్ జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు దసరా, విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 13 ఫిర్యాదులు స్వీకరణ : జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**



**చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 19 :** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 13 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా,ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని,పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి,వినతులు, ఫిర్యాదులు స్వీకరించి,అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదు దారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 19 :** హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. విజయదశమి పండుగను పురస్కరించుకుని గ్రామంలోని స్థానిక శివాలయంలో వెలసిన శ్రీ దుర్గామాత మండపం వద్ద ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కంకణాల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. పూజలో భాగంగా ఖడ్గం, త్రిశూలం వంటి సాంప్రదాయ ఆయుధాలకు మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు సమర్పించారు. అనంతరం భక్తులు, నాయకులు ఒకరికొకరు జమ్మి ఆకులను ఇచ్చిపుచ్చుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ జనగామ రాజేశ్వరరావు, ఈ హెచ్ పి మండల కార్యదర్శి భాషాబయిన



చంద్రయ్య, పట్టణ కార్యదర్శి కనకం శ్రీను, మండల గోరక్ష ప్రముఖ్ ఎడవెల్లి మల్లారెడ్డి, మండల కోశాధికారి రావుల సురేష్, ఎక్కటి వాసు, దాసరి రాజేందర్ రెడ్డి, తూముల వెంకట్రావు, ఆడపు మార్కండేయలతో పాటు విహెచ్‌పి సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ నివాసంలో నవరాత్రి ఉత్సవాలు

చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 19 : హనుమకొండలో మాజీ ఎంపీ కెప్టెన్ వి లక్ష్మీ కాంతారావు నివాసంలో దుర్గాష్టమి విజయదశమి పర్వదినాలను పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం జరిగిన పూజా కార్యక్రమాల్లో మాజీ ఎంపీ కెప్టెన్, మాజీ ఎంపీపీ వి సరోజినీ దేవి దంపతులు, మాజీ ఎమ్మెల్యే వి సతీష్ కుమార్, డాక్టర్ షమిత దంపతులు, యువనేత ఇంద్రనీల్, డాక్టర్ శంసిత



దంపతులు పాల్గొన్నారు.వేద పండితులు గణేష్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ దుర్గా అమ్మవారి చతుషష్టి పూజను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి చేసిన అలంకరణలు అందరిని కట్టిపడేస్తాయి. ముత్తయిదు వులకు పాదపూజ, చిన్నారులకు సువాసిని పూజలను నిర్వహిస్తున్నారు. మంగళహారతులతో, పాటలతో, భజనలతో అద్యంతం కార్యక్రమాలు భక్తులను కట్టిపడేస్తున్నాయి. ఆదివారం రాత్రి దుర్గాష్టమి సందర్భంగా సద్దుల బతుకమ్మ పూజలు కోలాటం ఆడారు. పూజా కార్యక్రమాల్లో కుటుంబ సభ్యులు బంధువులు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారు. విజయదశమితో పూజా కార్యక్రమాలు ముగియనున్నాయి.

# ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

**-కలెక్టర్ చిత్రా మిశ్రా**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 19 :** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి,అధికారులతో కలిసి ప్రజల నుంచి 44 అర్జీలు స్వీకరించారు.అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 19 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..సోమవారం కల్లా శాఖల లాగిన్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.వచ్చే సోమవారం నుంచి మొదటి గంటలో పెండింగ్ దరఖాస్తులను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని..ఈ లోగా అధికారులు లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు.కలెక్టరేట్ సూపరింటెశీడెంట్లు కాళీ చరణ్, మాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ కిసాన్ మోర్చా ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడిగా వంగల రాజు రెడ్డి

**-రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి**

**-బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 19 :** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడిగా వంగల రాజు రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం బీజేపీ ఎల్లారెడ్డిపేట మండల శాఖ అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రేపాక రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు, రైతుల సమస్యల పరిష్కారంలో కిసాన్ మోర్చా కీలక పాత్ర పోషించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించాలని, వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు.పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఎల్లారెడ్డిపేట మండలంలో కిసాన్ మోర్చాను మరింత బలోపేతం చేయాలని వంగల రాజు రెడ్డిని ఆకాంక్షించారు. రైతన్నలకు అండగా నిలుస్తూ,వారి సమస్యల పరిష్కారం కోసం పార్టీ తరఫున కృషిచేయాలని సూచించారు.వంగల రాజురెడ్డి నియామకం పట్ల బీజేపీ నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తంచేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి,నాయకులు బొమ్మిడి స్వామి,ధార్మికశాఖ కన్వీనర్ పరశురాం రెడ్డి,శీతల సాగర్ తదితరులుపాల్గొన్నారు.

# బీర్పూర్‌లో ప్రజావాణి కార్యక్రమం

**చురకలు విలేకరి, బీర్పూర్, అక్టోబర్ 19 :** బీర్పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఓ అర్జీ వచ్చినట్లు బీర్ పూర్ ఎంపిడివో భీమేష్ తెలిపారు.



మండలానికి చెందిన ఓ అర్జీదారు ఇందిరమ్మ ఇంటి మంజూరుకు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్ఐ శ్రీనివాస్, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 19 :** నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్మల్ జిల్లా పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు జిల్లా జడ్జి శ్రీవాణితో కలిసి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వేడుకల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సంబరాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి.పోలీస్ సిబ్బంది,వారి కుటుంబ సభ్యుల భాగస్వామ్యంతో వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయి. తెలంగాణ సంప్రదాయాలను పరిరక్షిస్తూ, పండుగల ద్వారా ఐక్యతను పెంపొందించుకోవాలని ఈ వేడుకలు చాటిచెప్పాయి.ఈ బతుకమ్మ వేడుకలో ఎస్పీ జానకి షర్మిలతో పాటు అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, బైంసా అడిషనల్ ఎస్పీ సాయికిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్,సిఐలు,ఆర్ఐలు, ఎస్సైలు,ఆర్ఎస్ఐలు,పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దసరాకు మేకలకు రెక్కలు

**-రేట్లు ఆకాశాన్ని తాకుతున్నాయ్**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్, అక్టోబర్ 19 :** దసరా పండుగ సందర్భంగామేకల ధరలకు రెక్కలు వచ్చాయి. బక్రీద్ కంటే దసరాకే మేకలకు డిమాండ్ ఎక్కువ ఉండటంతో కమాన్ పూర్ మండల వ్యాప్తంగా మేకల సంతలు కళకళలాడుతున్నాయి.గతంలో రూ.10 వేలకు దొరికే మేక ఇప్పుడు రూ.15 వేలు పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. మంచి బలమైన పొట్టేలు ధర అయితే రూ.20 వేల నుండి రూ.30 వేల వరకు పలుకుతోంది.

**ఎందుకీ డిమాండ్ :** దసరా సందర్భంగా తెలంగాణలో ఆచారం ప్రకారం ఇంటింటా మేకల బలి ఇవ్వడం, మటన్ వండుకోవడం ఆనవాయితీ. అందుకే ప్రతి కుటుంబం మేకను కొనడానికి ఆసక్తి చూపిస్తోంది.

**రైతులకు పండగే:** ఏడాది పాటు మేకలను మేపిన రైతులకు ఇది కాసుల పంట. ఇప్పుడు అమ్మితేనే మంచి లాభం వస్తుందని చెబుతున్నారు.

**కొనేవారికి షాక్:**

మధ్యతరగతి కుటుంబాలకు మాత్రం ధరలు షాక్ ఇస్తున్నాయి. అయినా పండుగ కోసం తప్పక కొనాల్సి వస్తోందని వాపోతున్నారు.పెద్దపల్లి, గోదావరిఖని, మంథని, కమాన్ పూర్ సంతల్లో ఈ వారం మేకల రాక ఎక్కువగా ఉంది. ఉదయం నుండే కొనుగోలుదారులు, అమ్మకందారులతో సంతలు రద్దీగా మారుతున్నాయి.కమాన్ పూర్ మండల వ్యాప్తంగా వందలాది మేకలు ఈ దసరా పండుగ కోయనున్నారు. దీంతో దసరా సందర్భంగా భారీ ఎత్తున ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు.

**మేకల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి**

వాడలో పలువురం కూడి మేకలు కోసుకుందామంటే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.మార్కెట్లో ఉన్న మేకలకు ధర చాలావరకు పెట్టి అమ్ముతున్నారు. గుండారం కమాన్ పూర్ తదితర ప్రాంతాల్లో మేకల ధరలు అడిగే వీలు లేకుండా పోయింది.గతిలేక కోళ్లను కోసుకునే గతి కూడా పట్టుతోంది.



**-ముకుంద శ్రవణ్**
**గుండారం రాజాపూర్**

# చెడుపై విజయమే విజయ దశమి

**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**



నవరాత్రి పదంలో నవ శబ్దం తొమ్మిది సంఖ్యను సూచిస్తుంది. నవరాత్రులను నవ అహోరాత్రాలు అని ధార్మిక గ్రంధాలు వివరిస్తున్నాయి. అంటే తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు నిర్వర్తించే దేవి పూజకు ఒక ప్రత్యక విధానం ఉంది. ఆశ్వయుజ శుక్ల పక్ష పాడ్యమి తిథి నుండి పూర్ణిమ వరకు తొమ్మిది రాత్రులు తొమ్మిది పగళ్ళు అమ్మవారిని పూజించడం ప్రశస్తంగా చెప్పబడింది. దీనినే 'శరన్నవరాత్రులు' లేదా 'దేవి నవరాత్రులు అంటారు.నవ రాత్రి వాస్తవానికి ఋతువుల సంధికాలం. అందుచేత సృష్టికి కారణమైన మహా మాయ తీవ్రవేగం కలిగి ఉంటుంది. పూజాదుల చేత ఆమెను ఆహ్వానించటం సులభ సాధ్యం. తొమ్మిది రోజులు నవ దుర్గలను నిష్ఠగా ఉపాసించే ఆరాధకులకు దేవి అనుగ్రహం లభిస్తుంది. నవ రాత్రులలో రాహుకాల వేళ రాహుకాల దీపం వెలిగించాలి. రాహు ప్రతికూల ప్రభావం తగ్గి, దోష నివారణ జరుగుతుంది. దేవి అర్చనలో లలితా సహస్రనామాలు, దుర్గాసప్తశతి పారాయణ చేసే భక్తుల కోరికలు నెరవేరుతాయి. రోగ పీడలతో బాధపడే వారు, జాతకంలో అపమృత్యు దోషం ఉన్నవారు ఈ తొమ్మిది రోజులు నియమం తప్పకుండా దేవి ఆరాధన చేయడం శుభకరం.సాధారణంగా విజయ దశమి నాడు శ్రవణ నక్షత్రం ఉంటుంది. నక్షత్ర మండలంలో శ్రవణ నక్షత్రం చెవి ఆకారంలో ఉంటుంది. అందుకే ఈ రోజు ఏదైనా కొత్త విద్యలు నేర్చుకోవాలనుకొనేవారు ఈ రోజు ప్రారంభిస్తే విశేషంగా లాభిస్తుంది. శమీ చెట్టు యొక్క పూజ ఈ రోజు విశేషంగా లాభిస్తుంది. జమ్మి చెట్టును పూజించడం లక్ష్మీప్రదమని పురాణాలు చెబుతు న్నాయి.శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయ దశమి రోజున పూజలు అందుకొన్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, ధన స్థానంలో నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుంది.పరమ శివునికి జగన్మాత దుర్గాదేవికి, సిద్ధి ప్రదాత గణపతికి శమీ పత్రి సమర్పించే ఆచారం అనాదిగా వస్తోంది. పూర్వం జమ్మి చెట్టు కాడల రాపిడి ద్వారా సృష్టించిన అగ్నితోనే యజ్ఞ యాగాదుల క్రతువులు నిర్వహించేవారు. ఇవాల్టికి దేశంలోని వివిధ ప్రాంతాల్లో శమీ వృక్షంలో అగ్ని ఉంటుందనే విశ్వాసం దృఢపడింది. అగ్ని వీర్యమే సువర్ణం కనుక జమ్మి బంగారం కురిపించే చెట్టుగా పూజార్హత పొందింది. ఈ రోజే శ్రీ రాముడు రావణునిపై విజయం సాధించాడు. విజయదశమి రోజునే శమీ పూజ కుడా నిర్వహిస్తారు. శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మి చెట్టు చెక్కతోనే నిర్మించారని చెబుతారు. శమి అంటే పాపాల్ని, శత్రువుల్ని నశింపజేసేది. పంచ పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్ళే ముందు తమ ఆయుధాలని శమీ చెట్టుపై పెట్టడం జరిగింది. సామాన్యులే గాక యోగులు నవరాత్రులలో అమ్మవారిని పూజిస్తారు. ముఖ్యంగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. ఆలయాలలో అమ్మవారికి విశేష అలంకరణలు, బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఈ తొమ్మిది రోజులు ఒక్కో రోజు ఒక్కో అలంకారం చేసి, పూజిస్తారు. అమ్మవారు లోక కళ్యాణం కోసం ఒక్కోరోజు ఒక్కో అవతారం ధరించింది. అందువలన అలా అమ్మవారు అవతరించిన రోజున, ఆ రూపంతో అమ్మవారిని అలంకరించి ఆ నామంతో ఆరాధిస్తూ ఉంటారు.



### మాజీ మంత్రి కొప్పుల సమక్షంలో

# బిఆర్ఎస్‌లో చేరిన పాశిగామ యువకులు

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 19 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పాశిగామకు చెందిన 54 మందితో పాటు జగదేవుపేటకు చెందిన ముగ్గురు యువకులు సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు మండలపార్టీ నాయకులు చల్లూరి రాంచంద్రం గౌడ్, జూపాక కుమార్ తెలిపారు. వీరికి పార్టీ కండువాలు కప్పి కొప్పుల ఈశ్వర్ సాధారంగా పార్టీలోకి ఆహ్వానించా రు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీతిరిగి అధికారంలోకి రావాలన్న కాంక్షతో యువత పెద్దఎత్తున పార్టీ లో చేరుతున్నట్లు మాజీ మంత్రి కొప్పుల స్పష్టంచేశారు.తన హయాం లో కోటిలింగాల ధర్మపురి ఆలయా లను అభివృద్ధి చేసి కొండగట్టు, గూడెం, వేములవాడ ఆలయాలను అను సంధానం చేస్తూ టెంపుల్ కారిడార్ చేసేందుకు కృషిచేసినట్లు, కోటిలింగాల ముంపు గ్రామంలోని కాలి భూమిని చదును చేయడంతో పర్యాటకంగా అభివృద్ధికి కృషిచేసి నట్లు, పాశిగామ ఇడ్లస్థలాలు, హరితహోటల్ నిర్మాణం చేపట్టి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ప్రస్తుతం మంత్రిగా కొనసాగుతున్న ఈ ప్రాంత ఎమ్మెల్యే పుష్కరాల నిధులు వచ్చేవరకు ఈప్రాంత అభివృద్ధి గురించి



ఎందుకుపట్టించు కోలేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చుడంలేదని ప్రజలు నిరసన వ్యక్తం చేస్తూ బిఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని, రాబోయేది తిరిగి బిఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు ఈ కార్యక్రమం లో పాశిగామ గ్రామశాఖ అధ్యక్షులు కంటెం పవన్, బిఆర్ఎస్ నాయకులుసర్పంచులు కోటయ్య, సుధాకర్, కొప్పుల సురేష్, అనుమాల తిరుపతి, రంగు తిరుపతి, బందెల సతీష్, నర్సయ్య, ఉపారపు సతీష్, మేరుగు అశోక్, రాపాక సత్తయ్య, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దుర్గామాతకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పూజలు

**-కమాన్‌పూర్‌లో సందడి**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్, అక్టోబర్ 19 :** ఆదివారం రాత్రి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కమాన్ పూర్ మండలంలో పలు దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు.కమాన్ పూర్ మండలం లోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ యూత్, సుభాష్ యూత్,కిష్టం పల్లె,రాజేంద్రనగర్, భవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధాన దుర్గామాత మండపం వద్ద మంత్రికి ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో, ఐక్యతతో జరుపుకోవడం హర్షణీయమన్నారు. అలాగే నిమజ్జనం శాంతియుతంగా జరుపుకోవాలని ఎటువంటి గొడవలకు తావివ్వకుండా ఉండాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్,సర్పంచులు రంగు సత్యనారాయణ గౌడ్, పోచాలు, ఉప సర్పంచులు అంబీరు రాజేందర్,



రఫిక్ సోహెల్, తోపాటు పోతుల కుమార్, ఇరగంటి రామారావు, అంబీరు శ్రీనివాస్, పీట్ల గోపాల్, కూలర్ గౌడ్ జెమినీ గౌడ్ సుతారి రాజేందర్, గడప కృష్ణమూర్తి, పిడుగు శంకర్, పిడుగు నరసయ్య, ముకుంద శ్రవణ్ , ముధం కొమురయ్య, రాచకొండ శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోషకాహారంతో ఎముకలకు పటుత్వం

**-అక్టోబర్ 20... బోలు ఎముకల వ్యాధి దినం**

**రామ కిష్టయ్య సంగన భట్ల...**




ఆధునిక సమాజంలో ఎన్నో వ్యాధులు మానవుల మనుగడకు ప్రశ్నార్థకంగా మారాయి.బలవర్థక మైన ఆహారం తీసుకోక పోవడంతో శరీరంలో శక్తి క్షీణించడమే కాకుండా, ఎముకల పటుత్వం కూడా కోల్పోయే పరిస్థితి వస్తుంది.దీని వల్ల అనేక సమస్యలు తలెత్తు తున్నాయి. ముఖ్యంగా అస్టియో పోరోసిస్ (బోలు ఎముకలు) వ్యాధి సంక్రమిస్తుంది. ఆహారపు అలవాట్లు, చెడు వ్యసనాల కారణంగా శరీరంలోని ఎముకలు పెలుసుగా మారి పలువురు ప్రమాదానికి లోనవుతున్నారు. ఎక్కువగా వృద్ధులకు వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం యువకు ల్లోనూ కనిపిస్తున్నది. ప్రత్యేకించి మహిళల్లో ఈ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఒక్కోసారి ఈ వ్యాధి మరణానికి కూడా దారి తీస్తుంది. ఈ నేపథ్యంతో అస్టియో పోరోసిస్ వ్యాధిపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధిపై అవగాహన కలిగించేలా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రతిఏటా అక్టోబరు 20వ తేదీన ప్రపంచ ఆస్టియో పోరోసిస్ నివారణ దినోత్సవాన్ని నిర్వహిం చాలని తీర్మానించింది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆధునిక పనిముట్లు అందుబాటు లోకి రావటంతో శారీరక శ్రమ తగ్గింది. దీనికితోడు బలవర్థకమైన ఆహారం తీసుకునే పరిస్థితి లేదు.వ్యాధిపై అవగాహన లేక పోవడంతో వ్యాధిగ్రస్థుల సంఖ్య నానాటికీ పెరుగు తున్నది.ఈ వ్యాధిపై ముందస్తు జాగ్రత్తలు లేకపోవడంతో కొందరు మంచానికే పరిమితం అవుతున్నారు. 80 శాతం మహిళలు, 20 శాతం పురుషుల్లో కనిపిస్తున్న ఈ బోలు వ్యాధి (ఆస్టియో పోరోసిస్) అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో 50--60 ఏళ్లల్లో కనిపించే బోలు వ్యాధి ఇప్పుడు 30 ఏళ్ల వారిలోనూ ఉండటం గమనార్హం. వృద్ధుల్లో ప్రధాన సమస్యగా ఉన్న ఈ వ్యాధిపై అవగాహన లేకపోవడమే దీనికి ప్రధాన కారణం.చిన్నతనం నుంచి కాల్షియంతో కూడిన ఆహార పదార్థాలు తరచుగా తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి ఉపశ మనం పొందవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా మహిళల్లో వస్తుంది. 45 ఏళ్లు పైబడిన మహిళలు ఈ వ్యాధికి ఎక్కువగా గురవుతున్నారు. విటమిన్ డీ లోపం, కాల్షియం తక్కువగా తీసుకోవడం, రుతు స్రావం తొందరగా ఆగిపోవడం, జన్యు పరమైన కారణాలు, రోగ నిర్ధారణ నియమాలు లేకపోవడం, ఎముకల ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా వస్తుంది.థైరాయిడ్ కారణం గా కూడా దీని ప్రభావం ఎముకల సాంద్రతపై కూడా పడుతోంది. సూర్యరశ్మి తగలక పోవడం,జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం,విటమిన్ 'డి'కొరత, స్టెరాయిడ్స్ వాడటం తదితర కారణాలతో ఇది వస్తుంది. సూర్యకాంతి లో గడిపే సమయం తక్కువగా ఉండడంతో మహిళలు ఈ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారికి సూర్యరశ్మి తగలక పోవటం, ఏసీలోనే ఎక్కువ సేపు గడపటం వల్ల కూడా అస్టియో పోరోసిస్ వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా గతంలో లాగా శారీరక శ్రమ తగ్గింది. ఇందువల్ల గ్రామీణ ప్రాంతాల వారు కూడా ఈ వ్యాధికి ఎక్కువగా గురవు తున్నారు. ఉదర సంబంధమైన వ్యాధులు ఉన్న వారిలో బోలు వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. సరైన పోషకాహారం తీసుకోక పోవడం, హైపో థైరాయి డిజం, హైపర్ థైరాయిడిజం, చిన్న వయసులోనే గర్భసంచి ఆపరేషన్ చేయించు కోవడం, కేన్సర్ చికిత్సల్లో భాగంగా కీమోథెరపీ చేయించడం, బక్కపలుచగా ఉండటం, శారీరక శ్రమ లేక పోవడం, రొమటాయిడ్ ఆర్థరైటిస్ ఉన్న వారిలోనూ బోలు వ్యాధి కనిపిస్తుంది. బోలు వ్యాధి ఉంటే తుంటి ఎముక, వెన్నుపూస, మణికట్టులు చిన్నచిన్న దెబ్బలకే విరిగి పోతుంటాయి. గతుకుల రోడ్లలో వేగంగా వెళ్లడం, సడన్‌గా బ్రేక్ వేసినప్పుడు ఎముకలు విరిగి పోతుంటాయి. బోలు ఎముకలు వల్ల తీవ్రంగా నీరసం వస్తుంది. విరిగిన వెన్నుపూస, ఎముకల వల్ల తీవ్ర నొప్పి, పెరుగుదల తగ్గడం, శరీరం వంగిపోవడం, నడవలేని పరిస్థితి, మనిషి కదలిక మందగించడం తదితరాలు. ఎముకల పటిష్టతకు కాల్షియం ఉండే ఆహార పదార్థాలతో పాటు మీగడ తీసిన పాలు, జున్ను తీసుకుంటే ఎంతో మేలు. ఉడక బెట్టిన బచ్చలికూర, బీన్స్, పచ్చి క్యాబేజీ, పచ్చి క్యారెట్, ఉడకబెట్టిన క్యాలీఫ్లవర్ తీసు కోవాలి. ఉడకబెట్టిన బెండ, బటానీలు, సోయాబీన్స్, ఉడక బెట్టిన పాలకూర, స్వీట్ పొటాటో తరచూ తీసుకోవాలి. ఖర్జూరం, కమలాలు, బొప్పాయి, బ్లాక్ బెర్రీలు తరచూ తీసుకోవాలి. బాదం పప్పు, ఎండబెట్టిన నువ్వులు, గుడ్లు తీసుకుంటే ఎముకల పటిష్టత పెరుగుతుంది.ప్రధానంగా జీవనశైలిలో తప్పనిసరిగా మార్పులు చేసుకోవాలి. వ్యాధిపై అవగాహన పెంచుకుని జాగ్రత్త పడాలి. వ్యాధికి గురి కాకుండా మంచి పౌష్టికా హారాన్ని తీసుకోవాలి. యువతీ యువకులు మద్యపానం, ధూమ పానానికి దూరంగా ఉండాలి. తక్కువ కొవ్వు పదార్థాలు ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. వ్యాధిగ్రస్థులు దృఢమైన ఎముకల కోసం, పగుళ్ల నివారణ కోసం కాల్షియం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. తృణ ధాన్యాలు కూడా ఎక్కువగా తీసుకోవాలి. ఎముకల సాంద్రత తగ్గిపోవడాన్ని నివారించే మందులు ప్రస్తుతం ఎన్నో అందుబాటులో ఉన్నాయి. ఈస్ట్రోజన్, హార్మోన్ చికిత్సలు కూడా ప్రస్తుతం అందుబాటు లోకి వచ్చాయి. ఇంజక్షన్లతో పాటు మందులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. 45 ఏళ్లపైబడ్డ వారు తప్పని సరిగా ఎముకల పరీక్ష చేయించు కోవాలి. చిన్నతనం నుంచే కాల్షియంతో కూడిన ఆహార పదార్థాలు తీసుకుంటే భవిష్యత్తులో సమస్యలు రావు. ఆహార నియమాలు తప్పని సరిగా పాటించాలి. వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు. వ్యాధిపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు ఎముకల పటుత్వ పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని త్వరగా గుర్తించి, చికిత్స చేయించు కోవాలి.

## విజయదశమి
# అందరికీ విజయాలు చేకూర్చాలి



**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**చురకలు ప్రతినిధి,జగిత్యాల, అక్టోబర్ 19 :** విజయదశమి పండుగ ప్రజలందరికీ అన్ని రంగాల్లో విజయాలు చేకూర్చాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకాంక్షించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో ఆయుధ పూజ, వాహన పూజ నిర్వహించారు.దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసి జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి దసరా శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రవికుమార్, ఇన్‌స్పెక్టర్లు వేణు, ఆరిఫ్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా వేడుకలను ప్రశాంతంగా, సరదాగా జరుపుకోవాలి

**-అవాంఛనీయ సంఘటనలకు తావివ్వొద్దు**

**-ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 19 :** దసరా పండుగ వేడుకలను ప్రజలందరూ సరదాగా,సంతోషంగా,ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ. వెంకటేష్ కోరారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల గ్రామాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.దసరా వేడుకలు సోదరభావంతో,ఐకమత్యంతో జరుపు కోవాలని,పండుగ సమయంలో ఎలాంటి గొడవలు,ఘర్షణలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో పండుగ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా గ్రామపంచాయతీ పాలకవర్గాలు, ప్రజా ప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటారని సీఐ వెంకటేష్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని, ఘర్షణలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలందరూ పోలీసులకు సహకరించి, దసరా పండుగను ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మంత్రిని సన్మానించిన డైరెక్టర్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 19 :** రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబును శ్రీ ఆది వరహాస్వామి డైరెక్టర్ తీగల రాజయ్య గౌడ్ ఘనంగా సన్మానించారు. రాష్ట్ర మంత్రి కమాన్ పూర్ వచ్చిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట తోట్ల తిరుపతి యాదవ్ మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ రెడ్డి ఉన్నారు.